# 20. సత్యసంధుడు

ఆ చెడు వార్తను ఆమె మొదట్లో నమ్మలేకపోయింది. అలా ఐ వుండదని సరిపెట్టుకుంది. కాని అదే నిజమైతే అనే ప్రశ్న వొచ్చి ఆమె కంపించింది. ఆ వార్త నిజమేనని తెలుసుకునేందుక్కూడా ఎక్కువసేపు పట్టలేదు. అప్పుడు ఆమె స్థితి ఆమెకే అర్థమవలేదు. వ్యక్తావస్థనుంచి ఏదో వూహాప్రపంచంలో వున్నట్టయింది.

క్రమంగా ఆమెకు తెలివి వొచ్చింది. తాను విన్న వార్త ఆమెకు పూర్తిగా అర్థమైంది. ఆ ఫలితాల్ని తాను ఎదుర్కొనే తీరాలని కూడా గ్రహించింది. కాని భయంతో తన శక్తికి మించిన యీ విషాదాన్ని ఎదుర్కునేందుకు మారుగా దిగజారిపోయి ఏడవసాగింది.

స్త్రీ అంతకన్న ఏం చేస్తుంది? అంతకు మించిన శక్తి ఆమెకు అలవడలేదు. ఐతే ఇలా ఏడవటంవల్లనే ఆమె తన భయాన్ని క్రమంగా పోగొట్టుకోగలిగింది. ఆ నిస్సహాయ స్థితిలో శర్మ రానే వొచ్చాడు. అతన్ని చూడగానే ఆమె ఎంతో సిగ్గుపడింది. తానింతగా దిగజారిపోయినట్టు శర్మకు తెలియటం ఆమెకు ఇష్టంలేదు. ఐతే అతనికి తెలియకుండా తాను దాయలేదు. అదీగాక, దారిచూపి సలహా చెప్పగల సహాయం కూడా అవసరం.

శర్మ తెలివిగలవాడనేందుకు సందేహం లేదు. యీ సంఘటనకు బెరుకుపడిపోయి తను కూడా దేబెమొహం వేసుకొని కూర్చోకుండా ఎంతో ధైర్యాన్ని చెప్పేందుకు ప్రయత్నించాడు.

"సీతా! నీ హృదయం ఎంత దహించుకొనిపోతోందో నేను అర్థం చేసుకోగలను. కాని నిన్నీవిధంగా నడిసముద్రంలో ముంచిన దాసుగాడి మనస్తత్వాన్ని నేను మొదటినుంచీ గ్రహించే నీకు హెచ్చరిక చేస్తూ వచ్చాను. ప్రణయ మైకంలో నా సలహాను ఎన్నడూ నువ్వు గుర్తించలేదు..."

ఆ జరిగిన కథను వినేందుకు సీతకు ఇష్టంలేదు. ఎందుకంటే అది ఆమె గాయాన్ని రేపుతుంది. ఇప్పుడామెకు కావాల్సింది గాయాన్ని మాన్పటం. అందుకనే ఆమె కళ్ళు తుడుచుకొని "శర్మా! నేను తెలివితక్కువదాన్నని తెలుసుకున్నాను. కనుకనే దాసు నా పట్ల ఎంతో ప్రేమను నటించి, నా హృదయాన్ని ఛిన్నాభిన్నం చేసి వాగ్దానాల్లో ఏ కొంత భాగాన్ని అమలు జరిపినా తృప్తిపడేదాన్ని" అంది.

"నేను మొదటినుంచీ చెపుతూనే వున్నాను. మొగవాడి మాటల్ని నమ్మ వొద్దంటే విన్నావా?"

"నీ సలహా పాటించనందుకు నాకు తగిన శాస్తే ఐంది" అని సీత వొప్పుకోక తప్పలేదు.

తనకు ఎంత గొప్ప విలువను సీత ఇస్తోందో శర్మ గ్రహించాడు. అన్నాడు: "సీతా! ఐనదానికి విచారించకు. మనశ్శాంతికోసం ప్రయత్నించు. ఇంతటితోనే జీవితం పూర్తవలేదు. యీ ఒక్క ఘట్టానికే నీ కోమల హృదయం ఎంతగా దెబ్బతిన్నదో తెలుసుకున్నాను. అదంతా ఒక కలవలె మరిచిపోవాలి--అంతే!"

"ఎట్లా?" అంది.

ఆ రహస్యం తెలియకే ఎంతోమంది బాధలుపడుతున్నారనే సంగతి ఆమెకు తెలియదు. అందుకనే ఆ తిరుగుడు శర్మకు తెలుసని ఆమె పొరబడింది.

"కాలచక్రంలో అన్నీ కరిగిపోక తప్పదు. మొగాడి మాటల్ని నమ్మవొద్దు. అదే కొండగుర్తు. నమ్మనందువల్ల యీ నిరాశ నిన్ను ఆవరించేది కాదు. తెలిసిందా?"

ఆమెకు నిజంగా తెలియలేదు. కాని ఆ మాట అనే సాహసం ఆమెకు లేకపోయింది. కాని కొండగుర్తును మాత్రం ఆమె జ్ఞాపకం వుంచుకుంది. ప్రాణాలమీద ఆశలేని వ్యాధితో బాధపడే రోగికి దారినపోయ్యే దానయ్య ఇచ్చే మందుకూ, ధన్వంతరి స్వయంగా ఇచ్చే మందుకూ భేదం ఎలా వుండదో - ఆ స్థితిలోనే ఆమె శర్మ మాటల్ని ఎలాటి అడ్డంకీ లేకుండానే అంగీకరించ గలిగింది. అంతేకాదు - ఆపదలో దొరికిన ఏ కాస్త సహాయమైనా ఎంతో గొప్పదిగా అనిపించినట్టు శర్మకు వ్యక్తిగతమైన విలువ యీ సందర్భంలోనే అనేక రెట్లు పెరిగింది. వరదలో కొట్టుకుపోతూ దొరికే ఆ కాస్త ఆధారమైనా ప్రాణానికి అడ్డం పడటం వల్ల దానికి ఏర్పడే విలువలాటిది శర్మకు వొచ్చింది.

"శర్మా! యీ అంధకారంలో నీవే నన్ను నడిపించాలి" అందామె, చెయ్యి జాపుతూ.

సంవత్సరంన్నరనుంచీ ఇలాటి సమయం కోసమే వేచి కూర్చున్న శర్మ ఆమె చేతిని అందుకోవటంలో ఎక్కువ ఆలస్యం చేయలేదు.

## 2

శర్మ తోడి తన స్నేహాన్ని అతి వేగంగా వృద్ధిచేసుకునేందుకు సీత ఏ విధంగానూ సందేహించలేదు. కారణాలు ఇవి: దాసుకు పోటీగా వొచ్చి తన ప్రణయభిక్షకోసం శర్మ ఆమెను చాలా రోజులుగా వేడుకుంటూనే వున్నాడు. ఒకప్పుడు ఆమె వీరిద్దరి ప్రేమనూ విడదీసి, తూచగల శక్తిని కూడా కోల్పోయింది, కాని సుగుణపరంపర కన్న, ఒక వ్యక్తిని మరో వ్యక్తి ఆకర్షించగలగటంలో దాసు ముందుగా విజయాన్ని సాధించగలిగాడు కనుకనే, తన హృదయంలో అతనికే ముందు స్థానాన్ని ఇవ్వగలిగింది. అది ఏ విధంగా శర్మను తక్కువచేయటం కాదుకాని శర్మ అడ్డపుల్లలు వేసి దాసును అవమానించే ధోరణిలో మాట్లాడటం ఆరంభించినప్పటినుంచి, శర్మ చూపే యీర్ష్యను ఆమె ఏవగించుకుంది. కాని శర్మ చెప్పేదంతా నిజమని తేలిన క్షణంలోనే ఆమె శర్మ తన మేలును కోరి చెప్పిన సలహాల విలువను గుర్తించింది. ఆ ఒక్క ఘట్టమే శర్మకు తనమీద వున్న ప్రేమను చాటదని ఆమె నమ్మింది.

పోతే, దాసుమీద ఆమెకు ఏర్పడ్డ కసిని ఆమె శర్మకు తన హృదయంలో స్థానమివ్వటం ద్వారా తీర్చుకోవటం వల్ల చాలావరకు చల్లార్చుకో గలుగుతోంది. ఇందుకే గాక – శర్మను ప్రేమించటం కూడా ఆమెకు ఏ మాత్రం చుట్టుతోవగా తోచలేదు. పైపెచ్చు శర్మ చెప్పే అమృతవాక్కుల్లో ఆమె తన్మయంచెందటంతో పాటు తన వ్యక్తిత్వాన్నే కోల్పోవసాగింది.

శర్మ చెప్పిన మాటల ప్రకారం – మరికొద్ది నెలల్లోనే వారి ఆదర్శ దాంపత్యం లోకానికి తెలిసిపోగలదు. అప్పుడు తాను కూడా అందరి గృహిణుల వలెనే గౌరవంగా జీవించగలదు.

కాని ఒకనాటి ఉదయాన – దాసుకన్న శర్మ ఏ విధంగానూ తీసిపోలేదని ఆమె తెలుసుకుంది. తనను తన గతికి వొదిలి శర్మ మిలటరీలో జేరాడు. ఆ సంగతన్నా తనకు చెప్పకుండానే అతను పరారయ్యాడు. భయం వల్లనా? తనను అంతగా ప్రేమించటమే అతనికి భయాన్ని కలిగించిందా? శర్మ తనకు దక్కడని తగినన్ని ఆధారాలున్నవి.

ఐతే యీసారి, మొదటిసారంతగా ఆమె తలక్రిందులు కాలేదు. ఎందుకంటే ఇలాటి దెబ్బలకు ఆమె కొద్దిగా అలవడే వుంది. జాగర్తగా ఆలోచించసాగింది. శర్మ మొదటినుంచీ చెప్పిన కొండగుర్తు ఆమెకు గుర్తుంది.

"మొగవాళ్ళ మాటల్ని ఎన్నడూ నమ్మకు --" అన్నాడు శర్మ. ఆమె ఆ విషయాన్ని ఎన్నడూ మరువలేదు. అందుకనే మొగవాళ్ళను మోసగాళ్ళగా ఆమె ఏనాడో నిర్ణయించుకుంది. ఐతే జరిగిన పొరపాటు ఎక్కడంటే - శర్మ కూడా మొగవాడేనని ఆమె ఆనాడు మరచిపోయింది. కాని యీనాడు శర్మ మొగతనానికి తార్కాణంగా మూడు నెలలుగా తన గర్భంలో పెరిగే బిడ్డ వుండనే వుంది.

శర్మ మరచిపోయిన ఒక సంగతి ఆమెకు ఇప్పుడు తట్టింది: అది- మొగవాళ్ళ మాటల్ని ఆడవాళ్ళు నమ్మకపోవటమే కాదు; మొగవాళ్ళు సత్యసంధులు కూడాను! మొగవాళ్ళందరి తరఫుగా శర్మ యీ విషయాన్ని రుజూ చేసే వున్నాడు. మిగిలిందల్లా ఆడవాళ్ళు ఎలాటివాళ్ళని తేల్చుకునేందుకుగాను, ఆమె స్త్రీగా మాత్రమే మరికొంతకాలం జీవించటం! ఆనాటినుంచీ యీనాటి వరకూ ఆమె ఆ రహస్యాన్ని భేదించేందుకే వ్యర్థ ప్రయత్నాలు చేస్తోంది.

*జనవరి, 1951*